క్లుప్తంగా

సొంత స్థలాలున్న పేదలకు గృహాల మంజూరు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలందరికీ గృహాలు మంజూరైనట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు నేస్తం నిధుల విడుదలకు ఇటీవల నిడదవోలు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తాను, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) కలిసి పరిస్థితిని వివరించామన్నారు. దాంతో గృహాలు మంజూరుకు అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 5 వేల మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ నెల 21లోగా డీపీఆర్ చేయాలని ఇంజినీరింగ్, గృహనిర్మాణ శాఖ అధికారులను ఎమ్మెల్యే తలారి ఆదేశించారు.

గురుకుల విద్యార్థినికి ఐఐటీలో సీటు



శిరీషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమాదేవి

గోపాలపురం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఇంటర్ మీడియట్ సెకండియర్ విద్యార్థిని లింగంకుంట శిరీషకు ఐఐటీలో సీటు లభించింది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణురాలైన శిరీషకు నాగాలాండ్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీర్‌లో అడ్మిషన్ లభించింది. ఈ విషయాన్ని ఆ పాఠశాల పాఠశాల ప్రిన్సిపాల్ టి. ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన శిరీషను, ఆమెకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను ఉమాదేవి అభినందించారు.

పౌష్టికాహారంపై అవగాహన

తాళ్లపూడి: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మలకపల్లి సెక్టార్ పరిధిలోని పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు, బాలింతకలకు, విద్యార్థినులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలతో బలవర్ధక ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వారికి వివరించారు. కార్యక్రమంలో పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ నాగేంద్రబాబు, సూపర్‌వైజర్ భానుమతి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని గర్భిణులు, బాలింతలు, రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, ఆసుపత్రి అసిస్టెంట్ సివిల్ సర్జన్ సయ్యద్ రెహానా, క్లబ్ సభ్యులు ఆకుల రామచంద్రరావు, పోలదాసు శ్రీనివాసరావు, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

గోపాలపురం: కరగపాడు పంచాయతీ పరిధిలోని బుచ్చియ్యపాలెంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై గోపాలపురం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.8200 నగదు, ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు.

మరుభూమికి దారేదంటూ మహిళల ఆందోళన

నల్లజర్ల: తమ శ్మశాన స్థలానికి వెళ్లేందుకు మార్గం చూపాలంటూ మండలంలోని పోతిసీడుపాలెం దళిత మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. పోతిసీడుపాలెం దళితుల శ్మశానానికి ఆర్ఎస్ నంబర్ 224లో మూడెకరాల భూమికి ప్రభుత్వం లోగడ కేటాయించింది. కాలక్రమేణా పక్క రైతులకు ఆ భూమిపై కన్ను పడింది. దాంతో ఆ మూడెకరాల భూమి కాస్తా ఇప్పుడు అరెకరానికి కుదించబడింది. రుద్ర భూమిని ఆక్రమించడమే కాకుండా దళితులు ఎవరైనా చనిపోయినపుడు శవాలను సైతం మరుభూమికి తీసుకెళ్లకుండా ఆక్రమిత రైతులు అడ్డగిస్తున్నారు. దీంతో మంగళవారం ఆగ్రామ దళిత మహిళలంతా ఆ శ్మశాన స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు కిశోర్‌కుమార్, సీఐ నున్న రాజు ఘటనా స్థలానికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు.

తూనికలు,కొలతల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

చాగల్లు: తూనికలు, కొలతల్లో అక్రమాలకు పాల్పడే, ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు వస్తువులను విక్రయించే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతల శాఖ కొవ్వూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ హెచ్చరించారు. నిడదవోలు, చాగల్లు మండలాల రేషన్ షాపుల్లో వాడే కాటాలను ఊనగట్ల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 75 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశామన్నారు. ముద్ర రుసుములో భాగంగా రూ.2.70 లక్షలు, తూనికలు, కొలతల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై రూ.4.76 లక్షల జరిమానా విధించామన్నారు.

ప్రసాద్ పొలం.. ప్రయోగ క్షేత్రం

- కొత్త వరి వంగడాల సాగు
- ఇప్పటికే 40 రకాలు పండించిన ఆదర్శ రైతు
- పురాతన విత్తనాలు పరిరక్షణ ఆయన లక్ష్యం



పంటను పరిశీలిస్తున్న రైతు నిమ్మలపూడి ప్రసాద్

నల్లజర్ల: కొత్త రకం వరి వంగడం అందుబాటులోకి వస్తే మొదట ఆయన పొలంలో పండించాల్సిందే. వ్యవసాయ శాఖ అధికారులు నమూనాగా విత్తనాలను ఆయనకే ఇచ్చి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తారు. ఆయన కూడా ఎప్పటికప్పుడు కొత్త రకం వరి వంగడాలను తీసుకు వచ్చి సాగు చేస్తారు. తద్వారా వచ్చే ధాన్యాన్ని విత్తనాలుగా సాటి రైతులకు అందిస్తారు. అంతేగాకుండా పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు ఏయే మెళకువలు పాటించాలో వారికి చెబుతారు. ఏరకం నేలలో ఏ వంగడాన్ని సాగు చేస్తే దిగుబడి బాగా వస్తుందో సాటి రైతుల సలహాలను ఆయన తీసుకుంటారు.ఆయనే నల్లజర్ల గ్రామానికి చెందిన ఆదర్శ రైతు నిమ్మలపూడి ప్రసాద్. డిగ్రీ వరకూ చదువుకున్నా ఉద్యోగం చేయకుండా, తనకిష్టమైన వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్నారు.

దాదాపు 40 వరకు కొత్త వరి వంగడాలను ఇప్పటి వరకూ నిమ్మలపూడి ప్రసాద్ తన వ్యవసాయ క్షేత్రంలో పండించారు. నూతన వరి వంగడాల సాగులో ఆయన ఆసక్తిని గుర్తించి ఉండి, బాపట్ల, మార్టేరు, లాంఫాం, నెల్లూరు, మచిలీపట్నంలలోని వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషీ విజ్ఞాన కేంద్రాల నుంచి ఆయనకు వివిధ రకాల నూతన వంగడాలను సాగ చేయమని పంపిస్తుంటారు. ఎప్పటికపుడు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్ర వేత్తలు వచ్చి ప్రసాద్ సాగు చేస్తున్న కొత్త వంగడాలను పరిశీలిస్తుంటారు. సూచనలు, సలహాలు అందిస్తుంటారు. ఇతర ప్రాంతాల రైతులకు ఆయన సాగు చేసిన విత్తనాలను అధికారులు సిఫార్సు చేస్తుంటారు. అంతరించిపోతున్న పురాతన వరి విత్తనాలను సంరక్షిస్తూ, లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారు రైతు ప్రసాదు. ఈఏడాది కేఎస్ఎం 1638 అనే విత్తనాన్ని సాగు చేస్తున్నారు.

ప్రసాద్ సాగుచేసిన ఎం.టి.యూ1273 రకం వరి పంట →



ఆరోగ్యానికి ఎంతో మేలు..



తీసుకునే ఆహారంలో మార్పుల వల్లే ప్రజల ఆరోగ్యంలో మార్పులు వస్తున్నాయి. చిన్న వయస్సులోనే అనేక రుగ్మతలకు లోనవుతున్నారు. దీనంతటికీ కారణం మనం తీసుకునే ఆహారంలో పోషకాలు లేకపోవడమే. పూర్వం వరి విత్తనాల ద్వారా వచ్చే ఆహార ఉత్పత్తులు ద్వారా మంచి పోషకాలు అందేవి. వాతావరణం, ప్రకృతి విపత్తులు తట్టుకునేలా పూర్వపు విత్తనాలు ఉండేవి. ప్రతి రైతూ తనకున్న కొద్దిపాటి భూమిలో కొంతైనా ఈ తరహా విత్తనాల సాగుకు కేటాయిస్తే ఎంతో మేలు.మార్కెట్‌లో వచ్చే విత్తనాల ద్వారా అధిక దిగుబడులు ఆశించడం కన్నా ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను పండించడం ఉత్తమం. పురాతన వరి విత్తన సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే నా ఆశయం.

–నిమ్మలపూడి ప్రసాద్,రైతు, నల్లజర్ల

లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గోపాలపురం ఏఎంసీ పాలకవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: రైతు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షకుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు అధ్యక్షతన స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏఎంసీ పరిధిలో లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. మరో రూ.22 కోట్ల వ్యయంతో తారు రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఏఎంసీ ఆవరణలో పెండింగ్‌లో ఉన్న పెట్రోల్ బంక్‌ను లీజుకు ఇవ్వగా రూ.12 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. నియోజకవర్గంలోని నల్లజర్ల, దూబచర్ల, అనంతపల్లి, పల్లంట్ల, రామన్నపాలెం గ్రామాలో మల్టీ పర్పస్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. ఏఎంసీ ఆవరణలో మినీ కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఏడీఎం సునీల్ కుమార్, జీవీవీ శెట్టి, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వాతంత్ర్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరంలో గడప గడపకూ..



కాటకోటేశ్వరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఆర్థిక స్వాతంత్రం వచ్చిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లుగా గ్రామంలో అమలైన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో సంక్షేమ లబ్ధి అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, పార్టీ నాయకులు కారింకి సూర్యచంద్రం, రేలంగి వెంకటేశ్వరరావు, కారింకి సత్యనారాయణ, ఉల్లి పోశి హరిశ్చంద్రప్రసాద్, గుంటుపల్లి శివ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక..

కాటకోటేశ్వరం టీడీపీ నాయకుడు, కాపు సంఘం నేత చిలుకూరి సత్యనారాయణ, రజక నాయకుడు పెనుగుర్తి సతీష్‌లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి మంగళవారం చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికే పోటీలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- నియోజకవర్గ స్థాయి అండర్-14,-17 క్రీడా పోటీలు ప్రారంభం



సర్వీసు చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టుల్లో ఆయన స్వయంగా సర్వీసులు చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఎంఈవో గురుమూర్తి అధ్యక్షతన ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో కూడా రాణించాలన్నారు. స్కూల్ గేమ్స్ నిర్వహణతో పాటు గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్పోర్ట్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ స్పోర్ట్స్ క్లబ్‌ల ద్వారా వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే కెరీర్ గైడెన్స్‌పై యువతకు అవగాహన, శిక్షణ అందిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎండీ షకీరాబేగం, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, హెచ్ఎం యు.గురునాథం, పీఈటీలు పద్మావతి, పి.శ్రీనివాస్, ఎన్టీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మినరల్ వాటర్ సరఫరా

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- అచ్చయపాలెంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



అచ్చయపాలెంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దాతల సహకారంతో అచ్చయపాలెం వాసులకు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రకటించారు. అవంతి ఫౌండేషన్ సహకారంతో దేవరపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చయపాలెంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ (ఆర్ఓ) ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ఈ వాటర్ ప్లాంట్ మెషినరీకి రూ.2.50 లక్షలను అవంతి ఫౌండేషన్ సమకూర్చగా, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షల వ్యయంతో షెడ్డు నిర్మించినట్టు తెలిపారు. ఈ మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద 20 లీటర్ల నీటిని రూ.5 కు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 10 యూనిట్ల ఏర్పాటుకు అవంతి ఫౌండేషన్ ముందుకు రాగా, ఇప్పటికే ఎనిమిదింటిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గోపాలపురంలోని పెద్దగూడెం, దేవరపల్లి మండలంలోని పల్లంట్ల గ్రామాల్లో మిగిలిన రెండు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అచ్చయపాలెం వాసులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ స్తంభాల వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, అవంతి ఫీడ్స్ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజరు అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి



తాళ్లపూడిలో గోదావరి రేవును పరిశీలిస్తున్న డీఎస్పీ వర్మ

తాళ్లపూడి: వినాయక విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేసేటపుడు నిబంధనలు పాటించని గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ వర్మ హెచ్చరించారు. తాళ్లపూడి మండలంలోని గోదావరి రేవులను మంగళవారం డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నది ప్రవాహం ఉధృతంగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల నిమ్జనానికి ఎక్కువ మంది గుంపులుగా హాజరు కారాదని సూచించారు. గోదావరి రేవుల వద్ద నిమజ్జనానికి రెవెన్యూ, పోలీసు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం చేసే వారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎస్పీ వెంట తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ, కొవ్వూరు రూరల్ ఎస్సై జి. సతీష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు కలవలపల్లి విద్యార్థి

చాగల్లు: రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు మండలంలోని కలవలపల్లి జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థి మట్టా శ్రీనివాస్ ఎంపికైనట్టు హెచ్ఎం జె.వెంకట శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీనివాస్ పాల్గొంటాడని ఆయన తెలిపారు. ఇటీవల గోపన్నపాలెంలో నిర్వహించిన అండర్- 18 జావెలిన్ త్రో పోటీల్లో శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించినట్టు హెచ్ఎం తెలిపారు.

బాలుడి అదృశ్యంపై డీఎస్పీ విచారణ

నిడదవోలు రూరల్: మండలం సమిశ్రగూడేనికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పాలపర్తి రోహన్ (రిక్కి) ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో విస్తృతంగా గాలిస్తున్నామని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. బాలుడు రోహన్ గత నెల 24 నుంచి కనిపించకపోవడంతో తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్సై సుభానీ సోమవారం విచారించి బాలుడి వివరాలు నమోదు చేసుకున్నారు. బాలుడు రోహన్‌ను బంధువులే దాచి పెట్టారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు

కొవ్వూరు: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం పట్టణ పరిధిలోని సచివాలయాల్లో ప్రత్యేక నవీకరణ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు మునిసిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. 20న శ్రీరామ కాలనీ సచివాలయంలోను, 21న మద్దిపట్ల వారి వీధిలోను, 22న గౌతమీ నగర్-1లోను, 23న ఆవుల వారి వీధిలోని సచివాలయం వద్ద ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు. ఆధార్ కార్డులో ఫోన్ నంబర్, అడ్రస్ వంటి మార్పులతో పాటు కార్డు తీసుకుని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఆధార్ కార్డులను నవీకరించు కోవాలని సూచించారు.

పశువుల చోరుడి అరెస్ట్

నిడదవోలు రూరల్: పశువుల పాకలో కట్టిన గేదెను, ఆవును మంగళవారం ఉదయం వ్యాన్‌లో తరలిస్తున్న అమలాపురానికి చెందిన బంటు సాయిబాబా అనే వ్యక్తిని సమిశ్రగూడెం పోలీసులు అరెస్టు చేశారు. ఆ పశువులు మండలంలోని పురుషోత్తపల్లి గ్రామంలోని జగత బుల్లి వీర్రాజుకి చెందినవి. పురుషోత్తపల్లి వద్ద ఆ గ్రామ రైతులు సాయిబాబాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధిత రైతు బుల్లి వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాయిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ తెలిపారు.

ఉమా సుతుడా.. నమో స్తుతే..



కొవ్వూరు మెరక వీధిలో వాటర్ ట్యాంక్ జంక్షన్ వద్ద భారీ గణనాథుడిని దర్శించుకున్న హోం మంత్రి తానేటి వనిత



నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్లో ఏర్పాటు చేసిన 16 అడుగుల వినాయక విగ్రహం వద్ద భక్తుల కోలాహలం



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం వడ్డీల రామాలయం వద్ద భారీ లంబోదరునికి పూజలు



నిడదవోలు మండలం డి.ముప్పవరంలో గణనాథుడ్ని దర్శించుకున్న భక్తులు



చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



చాగల్లులో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



ఉండ్రాజవరం మండలం చివటం వరసిద్ధి వినాయకుని ఆలయంలో పూజలు

కొవ్వూరు: హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొవ్వూరు మెరక వీధి వాటర్ ట్యాంక్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథుడ్ని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి 22వ వార్డు, పోతురాజు దిబ్బ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, ఐదో వార్డు సుబ్రహ్మణేశ్వరస్వామి గుడి వీధిలోని,10 వ వార్డు ఫ్యాక్టరీ రోడ్ రామాలయం వద్ద, 15వ వార్డు శ్రీనివాసపురం రామాలయం వద్ద గల గణనాథులను మంత్రి సందర్శించి పూజలు చేశారు.

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో దాత ఉప్పులూరి వీరభద్రరావు ఏర్పాటు చేసిన 16 అడుగుల భారీ విగ్రహాన్ని సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, యువత పోలీసు సిబ్బందికి సహకరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. భారీ ఎత్తున విద్యుత్తు దీపాల అలంకరణ చేశారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, పెండ్యాల, శెట్టిపేట, పందలపర్రు, తాడిమళ్ల, గోపవరం, పురుషోత్తపల్లి, కోరుమామిడి తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పార్వతీ తనయుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

దేవరపల్లి: స్థానిక మెరకవీధి వినాయకుడి ఆలయం, నిమ్మలపాటి వీధి, చంద్రబాబు కాలనీలోని గణపతి ఆలయాల్లో ప్రారంభమైన చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు పూజలు చేశారు. గణపతి నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.

ఉండ్రాజవరం: వేలివెన్ను గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన లక్ష్మీ గణపతిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. చివటంలోని వరసిద్ధి వినాయకుడి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు గంటిన లక్ష్మీ గణపతి, సుధారాణి దంపతులు పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం కాలువ ఒడ్డున గల వినాయక ఆలయం వద్ద, ఆంజనేయ స్వామి గుడి వద్ద, శివాలయం వద్ద, వడ్డీల రామాలయం వద్ద గణనాథుల విగ్రహాలు ప్రతిష్ఠించారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వద్ద మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రక్కిలంక లో మండలంలోనే భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

'సమరసత' ఆధ్వర్యంలో బాలవికాస్ కేంద్రాలు

నల్లజర్ల: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 828 దేవాలయాల్లో బాల వికాస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్రీయ స్వయం సేవక్ ధర్మ ప్రచారక్ పార్థసారథి వెల్లడించారు. మండలంలోని పుల్లలపాడులో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వేములమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాల వికాస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.శిక్షణ పొందిన మాతాజీ ఆధ్వర్యంలో 5 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఈ కేంద్రాల్లో సాయంత్రం గంట సేపు పాఠాలు బోధించి, హోం వర్క్ చేయిస్తారు. అనంతరం 15 నిమిషాల పాటు వారికి ఆధ్యాత్మిక విషయాలు బోధిస్తారన్నారు. ప్రత్యేక ఆహ్వానితులతో ఆదివారం ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఆటలు, పాటలు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ ధర్మ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు, నల్లజర్ల ప్రచారక్ పాతూరి ప్రసాద్, రిటైర్డు ఉపాధ్యాయుడు కాలి సుబ్బారావు, ఆలయ పూజారి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.